

వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు

- ఎంపీడీవో తిరుపతి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగునీటి కొరత లేకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎంపీడీవో: మండలంలో తాగునీటి కొరత ఉన్న గ్రామాలను గుర్తిస్తున్నాము. ముందస్తుగా బోర్ వెల్ మరమ్మతులు, మంచినీటి బావి విద్యుత్ మోటార్ల మరమ్మతులు, ప్రైవేట్ బావులను అద్దెకు తీసుకొని తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్నుల వసూళ్లు ఎంత మేరకు వసూళ్లు అయ్యాయి?

ఎంపీడీవో: మండలంలో ఇప్పటివరకు 73 శాతం మేరకు ఇంటి పన్నులు వసూలయ్యాయి. 22 గ్రామాల్లో రూ.48.72 లక్షల 859 మేరకు ప్రజల నుంచి ఇంటి పన్ను వసూలు చేశాము.

ఆంధ్రజ్యోతి : ఈజీఎస్‌లో ఎలాంటి కొత్త పనులు చేపట్టనున్నారు ?

ఎంపీడీవో: ఉపాధి కూలీలకు త్వరలోనే కొత్త పనులు చేపడతాము. పార్మిషన్ రోడ్డు నిర్మాణం, పశువుల పాకలు, గడ్డి పెంపకం, ఫారం పండ్, కోళ్ల ఫారం షెడ్ల నిర్మాణ పనులు ఉపాధి కూలీలు చేపట్టబోతున్నారు.

- ఓదెల

స్థానిక సంస్థల్లో బీసీలదే పైచేయి

- రిజర్వేషన్లు పెరగకున్నా అన్ రిజర్వుడు స్థానాల్లోనూ గెలుపు
- గత ఎన్నికల్లో పంచాయతీల్లో 74 సీట్లు, మండల పరిషత్‌లో 39 సీట్లు
- జిల్లా పరిషత్‌లో అదనంగా రెండు స్థానాల్లో విజయం
- బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల వర్గాలకు చెందిన వారే అధికంగా గెలుస్తున్నారు. రిజర్వ్‌డ్ స్థానాల్లోనే గాకుండా అన్‌రిజర్వుడు స్థానాల్లోనూ ఓసీలకు గట్టి పోటీనిచ్చి విజయం సాధిస్తున్నారు. ఐదేళ్లక్రితం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో 54.75 శాతం స్థానాలను దక్కించుకున్నారు. మండల పరిషత్ ఎన్నికల్లో 55.07 శాతం స్థానాలను, జిల్లా పరిషత్ ఎన్నికల్లో 46.15 శాతం స్థానాల్లో గెలుపొందారు. జిల్లాలో 263 గ్రామపంచాయతీలు ఉండగా బీసీలకు 70స్థానాలు, ఎస్సీలకు 55 స్థానాలు, ఎస్టీలకు 8 స్థానాలు, అన్ రిజర్వుడ్‌లో 130 స్థానాలు కేటాయించారు. ఇందులో బీసీ స్థానాలు 70తో పాటు అన్ రిజర్వుడ్‌లో 74 స్థానాల్లో, మొత్తం 144 స్థానాల్లో (54.75 శాతం) బీసీలు గెలుపొందారు.

మండల పరిషత్ ఎన్నికల్లో 138 ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు 37 స్థానాలు, ఎస్సీలకు 29 స్థానాలు, ఎస్టీలకు 2 స్థానాలు, జనరల్‌లో 70 స్థానాలను రిజర్వు చేశారు. ఇందులో బీసీ స్థానాలు 37, జనరల్‌లో 39 స్థానాలు, మొత్తం 76 స్థానాల్లో (55.07 శాతం) గెలుపొందారు. 13 జడ్పీటీసీ స్థానాల్లో నాలుగు స్థానాలు బీసీలకు, నాలుగు స్థానాలు ఎస్సీలకు, ఐదు స్థానాలను జనరల్‌కు కేటాయించారు. ఇందులో నాలుగు బీసీ స్థానాలు పోనూ, జనరల్‌లో రెండు స్థానాలను, మొత్తం ఆరు స్థానాలు (46.15 శాతం) బీసీలు కైవసం చేసుకున్నారు.

గత ఎన్నికల్లో బీసీలు సాధించిన సీట్లు

ఎన్నిక	స్థానాలు	బీసీలకు కేటాయించిన స్థానాలు	జనరల్‌లోగెలిచిన బీసీలు	మొత్తం
సర్పంచ్	263	70	74	144 (54.75 శాతం)
ఎంపీటీసీ	138	37	39	76 (55.07 శాతం)
జడ్పీటీసీ	13	4	2	6 (46.15 శాతం)

● రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు పెంచాలి..

రాజ్యాంగబద్ధంగా బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచితేనే మెజారిటీ బీసీలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరనున్నదని పలువురు పేర్కొంటున్నారు. ఆయా పార్టీలు బీసీలకు ఎక్కువ మొత్తంలో టికెట్లు ఇచ్చినా, ఇవ్వకున్నా చట్టబద్ధంగా రిజర్వేషన్లు కేటాయించాలని మెజారిటీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

ఈ దారిలో వెళ్లేదెలా?

- సుల్తానాబాద్‌లో ప్రధాన రహదారిపై దుమ్ము
- నరకయాతన పడుతున్న ప్రజలు



వాహనాలతో పాటు వెదజల్లుతున్న దుమ్ము

అది సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి గట్టేపల్లి వరకు గల మార్గం. ఉన్నత పాఠశాల, కోర్టు, ప్రభుత్వ ఆసుపత్రి, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ వంటి ప్రధాన కార్యాలయాలు ఉన్న ప్రధాన రహదారి. పెద్దఎత్తున వెదజల్లుతున్న దుమ్ముమూలంగా ప్రజలు ఆ దారి గుండా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై శంకుస్థాపన చేసినా పనులు జరగడం లేదు. దీంతో దుమ్మును ఇంకా ఎన్నాళ్లు భరించాలని ప్రజలు వాపోతున్నారు.

- సుల్తానాబాద్

8

పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లకు... తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే జైలుకే..

- రామగుండం కమిషనరేట్ పరిధిలో 25మందిపై కేసులు
- ప్రతీ ఏటా సుమారు 10వేల వరకు పీవీసీ, పీసీ సర్టిఫికెట్లు

- కోల్‌సిటీ



6

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన సందర్భంగా బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు డప్పుకొట్టి సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షు డు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షీరాభిషే కం నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథులుగా మాజీ మేయర్ బంగి అనిల్‌కుమార్, మహంకాళి స్వామి హాజరై మాట్లాడారు. 30 సంవత్సరాల పోరాటం ద్వారా ఎస్సీ ఉద్యమాలు చేసిన ఘనత మందకృష్ణ మాదిగదేనని వారు కొనియాడా రు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బిల్లును అసెంబ్లీలో ఆమోదించారన్నారు. వర్గీకరణ దేశంలోనే మొట్ట మొదటిసారిగా చేసిన రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కమిషన్ ఇచ్చిన సూచన మేరకు తదుపరి చర్యలు చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. దశాబ్దాలుగా వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు ఎదురుచూస్తున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దీటి బాలరాజు, కొలిపాక సుజాత, మల్లయ్య, పాతపల్లి ఎల్లయ్య, ముస్తఫా, గట్ల రమేష్, నాయిని ఓదెలు యాదవ్, కొప్పుల శంకర్, పులేందర్, దొంత శ్రీనివాస్, బాలరాజు, సంజీవ్, పెద్దెల్లి ప్రకాష్, టీ యుగంధర్, సింహాచలం, సాంబమూర్తి, దూళికట్ట సతీష్, కౌటం సతీష్, ఫజల్ బేగ్, అల్లి శంకర్, దళిత సంఘాల నాయకులు బొంకూరు మధు, రాజేష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలుపుతూ ప్రకటన చేయడంపై బుధవారం పట్టణ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. తెలంగాణ చౌరస్తాలో నాయకులు స్వీట్లు పంచారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు పార్టీ పరంగా అవకాశాలు కల్పిస్తామని సీఎం ప్రకటించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతో సామాజికవర్గంలోని అన్నివర్గాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమైన విషయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, నాయకులు సాగంటి శంకర్, సదానందం, చక్రపాణి, తిరుపతిరెడ్డి, కేశవులు, సారయ్య నాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్‌లో బీసీలకు అవమానాలే..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజిక వర్గాలకు రేవంత్‌రెడ్డి సర్కార్‌లో అన్ని అవమానాలే దక్కుతున్నాయని, సీఎం నిర్ణయం బీసీ వర్గాలను అపహాస్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. బీసీ సంఖ్యను తగ్గించి అసెంబ్లీలో కులగణన నివేదిక ప్రవేశపెట్టాడాన్ని నిరసిస్తూ స్థానిక గాంధీచౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తి కులాలుగా పేరున్న బీసీ సామాజిక వర్గాల పట్ల సీఎం తీసుకున్న నిర్ణయం సరైందికాదన్నారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేస్తోందన్నారు. అసెంబ్లీలో బీసీల జనాభాను 2014 జనాభా కంటే తక్కువ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. ఓసీల సంఖ్యను పెంచి చూపించారని, ఈడబ్లూసీ ఓసీలకు సమానహక్కులు రావడానికి రిజర్వేషన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. హడావిడిగా ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనతో సీఎం అసెంబ్లీలో కులాల గురించి చర్చ పెట్టి వెళ్లిపోయాడన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేను వెబ్‌సైట్ నుంచి తొలగించారన్నారు. బీసీ వర్గాలకు అవమానిస్తూ అసెంబ్లీలో కులగనణ రిపోర్టును ప్రవేశపెట్టిన ఫిబ్రవరి 4 బీసీ వర్గాలు చీకటి రోజుగా గుర్తుంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వేగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పుప్పాల తిరుపతి, శంకేసి రవీందర్, ఆసీఫ్, రోడ్డ శ్రీనివాస్, ఆకుల రాజబాబు, గట్టు శివశంకర్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లి తహసీల్దార్‌గా డి రాజయ్య



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెవెన్యూ అధికారులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండల తహసీల్దార్‌గా డి రాజయ్య బుధవారం విధుల్లో చేరారు. మంగళవారం కలెక్టర్ చేపట్టిన బదిలీల్లో భాగంగా పెద్దపల్లిలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజ్‌కుమార్‌ను మంథనికి బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న రాజయ్యను పెద్దపల్లికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజయ్య బుధవారం విధుల్లో చేరారు. డిప్యూటీ తహసీల్దార్లు విజేందర్, స్వప్న, సీనియర్ అసిస్టెంట్ రాజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సాకేత్, అర్‌ఐలు రాజిరెడ్డి, భాను, సిబ్బంది పుష్పగుచ్ఛంఅందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా జగదీశ్వర్‌రావు



కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్‌గా పుల్లూరు జగదీశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎండీ వకీల్ బదిలీపై ధర్మారం వెళ్లారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మంథని, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఉపాధి కల్పన పొందుతూ ఆర్థికంగా ఎదగాలని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్ సూచించారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో ఉషా ఇంటర్నేషనల్ కంపెనీ, సర్వోదయ యూత్ ఆరనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంకరి పద్మజా, చాపర్తి రవీందర్, కవిత, రమేష్, దయారాజ్, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు త్వరగా సబ్సిడీలు అందజేయాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికంగా ఎస్సీ, ఎస్టీలను ప్రోత్సహించేందుకు వారికి త్వరగా సబ్సిడీలను అందజేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఇండస్ట్రియల్ అధికారులు, బ్యాంక్ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహిక కమిటీలోని ఎస్సీ, ఎస్టీల సబ్సిడీలను త్వరగా ఆమోదించాలన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణలో జిల్లాలోని పదివేల మంది నిరుద్యోగ యువతలను గుర్తించి జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ పోర్టల్‌లో వారి వివరాలను ఏప్రిల్ నెలలోపు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు వెంటనే ఆమోదం తెలపాలని అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులో పాలిచ్చే గేదెలు కలిగి ఉన్న రైతులకు ప్రతీ వెటర్నరి డాక్టర్ 250 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు, బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శంకర్, ఇన్చార్జి ఏడీ ఇండస్ట్రీస్ కీర్తి కాంత్, ఎల్‌డీఎం వెంకటేష్, జోనల్ మేనేజర్ టీజీఐఐసి పద్మజ, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 100 శాతం ప్రసవాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పిడుగు కృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న పిడుగు కృష్ణ

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన పిడుగు కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ముదిరాజ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లూరి జగన్మోహన్ ముదిరాజ్ నియామకపత్రాన్ని పిడుగు కృష్ణకు బుధవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ ఈటల రాజేందర్, ప్రగతి మత్స్యకార సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పం శ్రీను ముదిరాజ్ కు పిడుగు కృష్ణ కృజ్ఞతలు తెలిపారు.

బాలసదనం ఏర్పాటు

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని అనాథ బాలికలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికల కోసం బాలసదనం బుధవారం ప్రారంభించారు. ఇందులో ఆరు సంవత్సరాల వయస్సు నుంచి 18సంవత్సరాల వయస్సు మధ్యలో ఉన్న పిల్లలకు అడ్మిషన్ కల్పిస్తామని వయోవృద్ధులశాఖ కార్యదర్శి వేణుగోపాలరావు తెలిపారు. ఉచిత వసతి, భోజనం, బట్టలు ఇస్తామని, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివిస్తామని తెలిపారు. పిల్లల పైచదువుల కోసం కూడా శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా అనాథ బాలికలు, తల్లికాని, తండ్రినికాని కోల్పోయిన వారు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికల సమాచారం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

మంథనిరూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామంలో గత వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. సమస్యలు వస్తే కుటుంబంలో అందరు కూర్చుని మాట్లాడుకుంటే సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. చిన్న సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదన్నారు. మానసిక సమస్యలు ఉంటే 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సైకాలజిస్టు రామకృష్ణ, వైద్య బృందం పాల్గొన్నారు.

ట్యాంకులు నిర్మించారు.. పైపులైన్ మరిచారు

- 8 గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం
- అర్థాంతరంగా నిలిచిన పైపులైన్ పనులు
- నిధుల కొరతే కారణం
- 'భగీరథ' నీటి కోసం ప్రజల ఎదురుచూపు



రాంనగర్‌లో వృథాగా మారిన భగీరథ ట్యాంక్

రామగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులు మండలంలో అర్థాంతరంగా నిలిచిపోయాయి. నాలుగేళ్ల క్రితం మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీల్లో మిషన్ భగీరథ పనులను ప్రారంభించారు. మంథని నియోజకవర్గం పరిధిలోని పలు మండలాల్లో 2021 అక్టోబరులో వాటర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులకు అగ్రిమెంట్లు కుదిరాయి. అందులో భాగంగా రామగిరి మండలం చందనాపూర్ రూ. 33 లక్షలు, ముస్యాల రూ. 48.50లక్షలు, వెంకట్రావ్‌పల్లిలో రూ. 49లక్షలు, సుందిల్ల రూ.41లక్షలు, నాగెపల్లిలో రూ. 31 లక్షలు, కల్వచర్ల(గొల్లపల్లి) రూ. 50లక్షలు, రత్నాపూర్ రూ. 40లక్షలు, కల్వచర్లలో రూ. 68లక్షలతో వాటర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామాల్లో వాటర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తిచేసిన కాంట్రాక్టర్లు నిధుల కొరతతో పైప్‌లైన్ పనులను వదిలేశారు. చేసిన పనులకు డబ్బులు రాలేదంటూ పనులను నిలిపివేశారు. దీంతో గ్రామపంచాయతీలోని వాటర్‌హెడ్ ట్యాంకులకు సంబంధించిన పైప్‌లైన్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంకులు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. సుమారు మరో రూ. 50 లక్షలు వెచ్చిస్తే ఎనిమిది గ్రామపంచాయతీల ప్రజలకు భగీరథనీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పల్లె ప్రజలకు అందని భగీరథ నీరు

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భగీరథ ట్యాంకులు సరిగ్గా లేకపోవడం, కొన్ని చోట్ల పైపులైన్లు లీకేజీలు అవుతున్నాయి. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరును అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● మిషన్ భగీరథ పథకం ప్రారంభించి ఎళ్లు గడుస్తున్నా గుడిపెల్లి గ్రామంలోని గౌడ సామాజిక కాలనీకు చుక్క నీరు అందడం లేదు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గుడిపెల్లికి చెందిన శ్రీరాముల స్వామి అధికారులను కోరారు.

● నిధుల మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

- రాజ్‌కుమార్, డీఈ



నిధులు మంజూరు కాగానే పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నీతి ఆయోగ్ నిధులకు సైతం ప్రతిపాదనలు అందజేశాం. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో చేతిపంపులు, పైప్‌లైన్ మరమ్మతు వెంటనే చేయించాలని ఆయా గ్రామపంచాయతీలకు ఆదేశాలు జారీ చేశాం. వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు పటిష్టంగా చేపడుతున్నాం.

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య



గంగాధర్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లకుండా చెడు తిరుగుడు తిరుగుతున్నావని తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములకుర్తి గ్రామంలో విషాదం నింపింది. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపినవివరాల ప్రకారం.. వేములకుర్తి గ్రామానికి చెందిన బోదాసుగంగాధర్ (15) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు. స్కూల్‌కువెళ్లకుండా చెడు తిరుగుడులు తిరుగుతున్నావని తల్లి బోదాసు రాజవ్వ బుధవారం కొడుకును మందలించి వ్యవసాయ పనులకు వెళ్లింది. మనస్తాపానికి గురైన గంగాధర్ తల్లి వ్యవసాయ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. గమణించిన గంగాధర్ చిన్నమ్మ చుట్టుపక్కన వాళ్లను పిలిచి కొనఊపిరితోఉన్న గంగాధర్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లింది. చికిత్సఅందిస్తుండగా మృతిచెందినట్లు ఎస్‌ఐతెలిపారు. తల్లిరాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపు తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడు..



మనోజ్ (ఫైల్)

రాయికల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన గాజుల మనోజ్ (28) అనేయువకుడు తనకు పెళ్లికావడం లేదంటూ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో బుధవారం రాయికల్ శివారులోని మర్రిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడితండ్రి గాజులనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

బావిలో పడి బాలుడి మృతి

ఎండపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకు ఇంట్లోనే కళ్లముందు ఆడుకున్న బాలుడు బావిలో పడి మృతిచెందిన ఘటన గుళ్లకోట గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుళ్లకోట గ్రామానికి చెందిన మంతెన శిరీష రంజిత్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు వేదాన్ష్ (2) అదే ఊరిలో తమ ఇంటి సమీపంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి ఒక్కడే తరచుగా వెళ్తుంటాడు. బుధవారం అమ్మమ్మ ఇంటికి వెళ్తున్న వేదాన్ష్ బీసగోని గంగయ్య ఇంటి ఆవరణలో గల మంచి నీటి బావిలో పడ్డాడు. అప్పటికప్పుడే బాలుడు కనిపించకపోవడంతో కుటుంబీకులు వెతకడంతో బావిలో మునుగుతూ తేలుతూ ఉన్న బాలుడిని గమనించారు. కేకలు వేయడంతో స్థానికుల్లో ఒకరు బావిలోకి దిగి వేదాన్ష్‌ను బయటికి తీశారు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అవకాశాలను అందిపుచ్చుకుంటూ..



పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళలు

- పెట్రోల్ బంకుల్లో మగవారితో సమానంగా విధులు..
- కుటుంబ పోషణలో పాలుపంచుకుంటున్న యువతులు, మహిళలు



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అవకాశాలను అందిపుచ్చుకుంటూ.. ప్రతి పనిలోనూ మహిళలు రాణిస్తున్నారు. ఒకప్పుడు పెట్రోల్ పంపుల్లో మగవారు మాత్రమే పనులు చేసేవారు.. కానీ ఇప్పుడు మహిళలు కూడా అన్ని పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కుటుంబ ఖర్చులు పెరగుతున్ననే పథ్యంలో వ ంగ వారికి ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, పదిర గ్రామాల్లోని పెట్రోలు పంపుల్లో పనులు చేస్తున్న మహిళలు. ఇంటి పనులను చక్కదిద్దుతూనే పంపుల్లోకి చేరుకుని పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, పదిర గ్రామాల్లోని పెట్రోల్ పంపుల్లో మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, బండలింగంపల్లి, పదిర గ్రా మాలకు చెందిన సుమారు 10 మంది మహిళలు, యువతులు పనులు చేస్తున్నారు. ఉదయం ఇంటి పనులను ముగించుకుని 9 గంటల వరకు పెట్రోల్ పంపులకు చేరుకుంటున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పనులు చేస్తున్నారు. వచ్చే వేతనంతో పిల్లల చదువులు, కుటుంబ పోషణకు వెచ్చిస్తున్నారు.

పాప చదువు కోసం వెచ్చిస్తున్నా..

పోతరాజు లావణ్య, బండలింగంపల్లి



మా ఊరు బండలింగంపల్లి. నా భర్త బాలకిషన్ కూలీ పనులు చేసేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉంటున్నాడు. మా కూతురు మహశ్రీ బీటెక్ చదువుతోంది. కుటుంబ పోషణ, పాప చదువులకు డబ్బులు లేక ఇబ్బందిగా మారింది. దాంతో నేను ఎల్లారెడ్డిపేటలోని పెట్రోల్ పంపులో నెలకు రూ.8 వేల వేతనానికి పనిలో చేరాను. వచ్చే జీతాన్ని పాప చదువుకు వెచ్చిస్తున్నా.

వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నా...

కముటం స్రవంతి, నారాయణపూర్

మాది ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. నా భర్త రవి కొవిడ్‌తో నాలుగేళ్ల కిందట మృతిచెందాడు. పాప జాగృతి నాలుగో తరగతి చదువుతోంది. నా భర్త చనిపోవడంతో పోషణ భారం నా మీద పడింది. ఉదయం ఉపాధి పనులకు వెళ్లి 9 గంటలకు మండల కేంద్రంలోని పెట్రోల్ పంపునకు చేరుకుని పనులు చేస్తున్నా. నెలకు రూ.9 వేల వేతనం వస్తోంది. సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకుని బీడీలు చేస్తా. ఉపాధి, బీడీలు చేయగా వచ్చిన డబ్బులతో ఇంటి ఖర్చులు, పంపులో పని చేస్తే వచ్చే జీతంతో నెలవారి చిట్టీలకు చెల్లిస్తున్నా.



యేడాది నుంచి క్యాషియర్‌గా పని చేస్తున్నా..

నేవూరి రజిత, ఎల్లారెడ్డిపేట

మాది ఎల్లారెడ్డిపేట. మా తల్లి లక్ష్మీ అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటోంది. అమ్మకు చేతకాకపోవడం వల్ల ఇంటిలోనే బీడీలు చేసేదాన్ని. వచ్చే డబ్బులు అమ్మ మందులు, పోషణకు సరిపోక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దాంతో గ్రామ శివారులోని పెట్రోల్ పంపులో యేడాది నుంచి పనులు చేస్తున్నా. పెట్రోలు, డీజిల్ పోయడంతో పాటు డబ్బులు తీసుకోవడంలాంటి పనులను చేసి లెక్క అప్పగిస్తున్నా. నా పనితనం చూసిన నిర్వాహకులు క్యాషియర్‌గా నియమించారు. నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నా.



ఉపాధి పొందుతున్నా

జొన్నల మంజుల, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేటలో అద్దెకు ఉంటున్న మేము స్థానికంగా ఉపాధి పొందేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. నా భర్త రాజు కటింగ్ షాపులో పని చేస్తున్నాడు. ఒక్కడే పని చేయడం వల్ల ఖర్చులకు సరిపోక అవస్థలు పడ్డాం. ఏదైనా పని చేయాలని నిర్ణయించుకున్నా. గ్రామ శివారులోని పెట్రోలు పంపులో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తున్నా. నెలకు రూ.9 వేలు వస్తున్నాయి. భార్యాభర్తలం ఇద్దరం సంతోషంగా జీవిస్తున్నాం.

రూ.3.50కోట్లకు ఐపీ పెట్టిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లపట్టణంలోని గోపాల్‌నగర్‌లో గల ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని రూ.3.50 కోట్లకు ఐపీ దాఖలు చేశాడని తెలిసింది. ఇటీవల కొంతకాలంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహణ పేరిటకోట్ల రూపాయలకు యజమాని అప్పులు చేశాడని తెలిసింది. అయితే పెట్టుబడి పెట్టి అప్పుల పాలు కావడంతో చివరికి చెల్లించలేని పరిస్థితుల్లో ఐపీ దాఖలు చేశాడని సమాచారం. ఇందులో భాగంగానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను రూ.25 లక్షలకు మరోవ్యక్తికి విక్రయించినట్లు సమాచారం. ఈ ఐపీలో అప్పులు ఇచ్చిన వారి జాబితాలో 50మందికి పైగా బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష

రుద్రంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించినందుకు భర్తకు మూడు నెలల జైలు శిక్షను వేములవాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి విధించినట్లు ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో రుద్రంగికి చెందిన ఆరేటి లావణ్య తన భర్త అయినా నిజామాబాద్ జిల్లా చెందిన ఆరేటి నరేందర్‌పైన గృహ వేధింపుల ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న వేములవాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి నిందితుడు ఆరేటి నరేందర్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారని తెలిపారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రుద్రంగి ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుల్ ఎస్. శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, మధుసూదన్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గొల్లపెల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండల కేంద్రంలోని 735 సర్వే నంబర్‌లో 105ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఆభూమిలో 25ఎకరాలు ఆక్రమించి బహుల అంతస్తుల భవనాలు నిర్మించడంతోపాటు కల్యాణమండపం నిర్మించారని గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కట్టమహేష్ అనేవ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ భూమిలో మామిడి తోటలుపెంచారని, ప్రజాప్రయోజనార్థం గురుకుల విద్యాలయానికి, మినీ స్టేడియానికి ఏడుఎకరాలభూమి కేటాయించిన అధికారులు హద్దులు చూపించకపోవడంతో కొందరువ్యక్తులు ఆభూమిని ఆక్రమించుకొని స్వంత ప్రయోజనాలకు వినియోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పసికందు మృతి

- వ్యాక్సిన్ వికటించడమే కారణమంటూ తల్లిదండ్రుల ఆరోపణ



ఆసుపత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్లరూరల్), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరేళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పసికందు మృతిచెందిన సంఘటన వివాదాస్పదంగా మారింది. వ్యాక్సిన్ వికటించడం వల్లనే పసికందు మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నేరేళ్ల గ్రామానికి చెందిన దాసరి లలిత, రమేష్ దంపతుల కూతురు (45రోజులు)కు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు బుధవారం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. సిబ్బంది పసికందుకు టీకా వేసి పంపించారు. ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే పసి కందు కదలకపోవడంతో ఆందోళనచెందిన తల్లిదండ్రులు తిరిగి ఆసుపత్రికి తీసువచ్చారు. పరీక్షించిన సిబ్బంది సూచనమేరకు సిరిసిల్లలోని ప్రైవేటుఆసుపత్రికి తరలించామని, పరీక్షించిన వైద్యులు అప్పటికే పసికందు మృతిచెందినట్లు ధ్రువీకరించారని తల్లిదండ్రులు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమపాప చనిపోయిందంటూ ఆరోపించారు. పాపమృతికి కారకులైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. నేరేళ్ల పీహెచ్‌సీలో పసికందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రుల వద్దకు సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీకలెక్టర్ రాధాబాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకొని బాధితులకు తక్షణసాయం కింద రూ.2లక్షల చెక్కును అందజేశారు. సంఘటనపై విచారణజరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

అంతర్గాం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలపరిధిలోని గోలివాడ పంప్‌హౌజ్‌లో బోరు రిపేరు చేస్తుండగా ప్రమాదం జరిగి గుండబోయిన సంపత్ (35) అనే మెగా కంపెనీ కార్మికుడు బుధవారం మృతిచెందాడు. అంతర్గాం ఎస్‌ఐ వెంకటస్వామి, పంప్‌హౌజ్ ఈఈ సత్యనారాయణ తెలిపినవివరాల ప్రకారం.. పంప్‌హౌజ్‌లో కొన్నిరోజులుగా బోరు పనిచేయడం లేదు. బోరుకు మరమ్మతులు చేసేందుకు హైడ్రాద్వారా పనులు చేపడుతుండగా సంపత్ దగ్గ రుండి బోరులోకి పైపుపైకి రావడం లేదంటూ తొంగిచూశాడు. ఈ క్రమంలో బోరులోని పైపు ఒక్కసారిగా పైకి వచ్చి సంపత్ కన్ను,తలభాగంలో బలంగా తగిలింది. దీంతో తీవ్రగాయాలు కావడంతో తోటికార్మికులు, అధికారులు 108లో చికిత్స నిమిత్తం గోదావరిఖని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతుడికుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తోటికార్మికులు, స్థానికులు కోరుతున్నారు.

పసికందు మృతిపై బంధువుల ఆందోళన

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పసికందు మృతదేహంతో బంధువులు మంగళవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ వైద్యుల నిర్లక్షం వల్లే ఏడురోజుల పసిబిడ్డ మృతిచెందిందంటూ ఆరోపించారు. సిరిసిల్లపట్టణం అశోక్ నగర్‌కు చెందిన రాగల్ల స్వరూప జనవరి 27న జిల్లా ప్రభుత్వ ప్రధానఆసుపత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చింది. 29నఅస్వస్థకు గురైన శిశువును వైద్యుల సూచనతో కరీంనగర్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూనే సోమవారం మరణించింది. దీంతో మంగళవారం ఉదయం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో మగశిశువు మృతిచెందిందంటూ శిశువు బంధువులు నిరసనచేపట్టారు.సంఘటన స్థలంకుచేరుకున్న పోలీసులుఆందోళన విరమింపజేశారు. మగశిశువుమృతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ వివరణ ఇచ్చారు. శిశువుజెనిటిక్ డాజార్డర్‌తో పుట్టిందని, శిశువు మరణించడంలో వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బీర్‌పూర్,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికిచెందిన తొడవేణి రాము(26) చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగేళ గ్రామానికిచెందిన రాము కొన్ని రోజుల నుంచి జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. ఆరోగ్యం సరిగాలేక మూడు నెలల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటి నుంచిఅప్పులు బాగాఅయ్యాయని మానసికంగా బాధపడుతూ జనవరి 26న రాత్రి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమణించిన రాము భార్య తొడవేణి లక్ష్మి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం తెల్లవారు జామునమృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పదహారేళ్ల బాలికను రెండు రోజుల కిందట కిడ్నాప్‌చేసి బలవంతంగా వివాహం చేసుకునేందుకు యత్నించిన నిందితుడితోపాటు మరోముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సృజన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. బాలికను కిడ్నాప్‌చేసిన నిందితులు రామడుగు మండలం తిరుమలాపూర్‌కు చెందిన కర్ణకంటి అలియాస్ కర్ణ నరేష్(32), మానకొండూర్ మండలం వెల్దికి చెందిన బాణాల శ్రావణ్(31), నల్లగొండ జిల్లా కాసంగోడె గ్రామానికి చెందిన కర్ణి అలియాస్ గౌరారపు కళ్యాణి(29), జమ్మికుంట మండలం మోదుగుల గూడెం గ్రామానికి చెందిన కర్ణె సుమలత(28)ను కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. వీరిలో కర్ణకంటి అలియాస్ కర్ణ నరేష్ గతంలోనూ మైనర్ వివాహానికి పాల్పడిన కేసులో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందిన 24గంటలవ్యవధిలో కేసును చేదించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు


శంకరపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్‌లో కోతుల దాడిలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెనగంటి భూలక్ష్మిపై బుధవారం సాయంత్రం ఆమె ఇంటివద్ద ఒకేసారి ఐదుకోతులు దాడి చేశాయి. ఈదాడిలో ఆమె ఎడమకాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్సనిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్‌గ్రామంలో అక్రమంగా ఇసుకనుతరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కోర్కల్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా ఇసుకట్రాక్టర్ పట్టుబడిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించి డ్రైవర్,ఓనర్ ఎల్కపల్లి రాజయ్యపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే జైలుకే..

- పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ల విషయంలో పోలీసుల హెచ్చరిక
- రామగుండం కమిషనరేట్ పరిధిలో 25మందిపై కేసులు
- ప్రతీ ఏటా సుమారు 10వేల వరకు పీవీసీ, పీసీ సర్టిఫికెట్లు
- గేట్ పాస్‌లు రావేమోనని కార్మికుల తప్పుడు అఫిడవిట్లు
- సీసీ టీఎన్ఎస్ యాక్సెస్‌తో ఎక్కడ కేసు నమోదు అయినా వెలుగులోకి...



కోల్‌సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇకపోలీస్ వెరిఫికేషన్‌సర్టిఫికెట్లు (వీవీసీ), పోలీస్‌క్లియరెన్స్ సర్టిఫికెట్ల(పీసీసీ)కు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే దరఖాస్తుదారులు జైలుకు వెళ్లనున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం పోలీస్ కమిషరేట్‌పరిధిలో పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లకు సమర్పించే అఫిడవిట్లపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వఉద్యోగాలు, ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటి సాయుధ దళాల రిక్రూట్‌మెంట్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వివిధ పరిశ్రమల్లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు పనులకు సంబంధించి పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరి. పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు ఉంటేనే ఉద్యోగం ఇవ్వడం కానీ, ఉద్యోగాలు పొందిన వారు కొనసాగడం కానీ జరుగుతుంది.

● ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. pvc.tspolice.govt.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పిస్తారు. ఈ దరఖాస్తులో వివిధ డాక్యుమెంట్లతో పాటు తనపై నమోదు అయిన క్రిమినల్ కేసుల వివరాలు, నేరారోపణలు, ఎన్నికేసులు నమోదు అయ్యాయి. అరెస్టు అయ్యారా లేదా, కేసులు వీగిపోయాయా అనే వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. దీంతో పాటు రూ.20స్టాంప్ పేపర్‌పై కేసుల వివరాలతో నోటరీ అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పీవీసీకి దరఖాస్తు చేసుకున్న తరువాత నేరుగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగానికి వెళుతుంది. అక్కడ సాఫ్ట్‌వేర్‌లో స్క్రూటినీ తరువాత ఆయా జిల్లాల, పోలీస్ కమిషనరేట్ల ఎస్‌బీ విభాగాలకు దరఖాస్తు ఫార్వర్డ్ అవుతుంది. ఇక్కడ సీసీటీఎన్ఎస్ యాక్సెస్, ఈ కోర్టులతో నేరస్థుల జాబితాలో ఉన్నారా లేదా అనే వివరాలను చెక్ చేసుకుంటారు. 90శాతంఇక్కడే దరఖాసుదారులకు ఏమైన నేరచరిత్ర ఉంటే బయట పడుతుంది. తరువాత దరఖాస్తుదారుల ఇళ్ల వెళ్లి ఎస్‌బీ ఫీల్డ్ ఆఫీసర్లు విచారణ జరుపుతారు. దరఖాస్తు దారులనుంచి ఒరిజినల్ నోటరీ అఫిడవిట్‌ను తీసుకుంటారు. పూర్తివివరాలతో మళ్లీ అప్‌లోడ్ చేస్తారు. దీని ఆధారంగా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు లభిస్తాయి.

● కియరెన్స్ సర్టిఫికెట్ల కోసం..

పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లకు దరఖాస్తుదారులు తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నారు. చాలామంది ఉద్యోగాలు పొందిన వారు గతంలో తమపై నమోదు అయిన కేసుల వివరాలను దాచిపెడుతున్నారు. రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో గల ప్రభుత్వరంగ సంస్థలైన ఎన్‌టీపీసీ, సింగరేణి, జెన్‌కో, ఆర్‌ఎఫ్‌సీఎల్, జైపూర్ పవర్ ప్లాంట్, ప్రైవేట్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, ఆర్‌టీసీలో పనిచేసే ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది, రైల్వేలోని వివిధ విభాగాల్లో పనిచేసే సిబ్బంది, బ్యాంకులు, ఏటీఎంలకు నగదు రవాణా చేసే అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు సిబ్బందికి, ఇతర ప్రైవేట్‌కంపెనీల్లో పనిచేసే సిబ్బందికి ప్రతిఏటా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. వీవీసీ ఆధారంగానే వారికి గేట్‌పాస్‌లు మంజూరవుతాయి. ఒక కమిషనరేట్ పరిధిలోనే ప్రతి ఏటా 10వేల మందికి ఈ విధంగా పీవీసీలు జారీ చేయాల్సి ఉంటుంది. గేట్‌పాస్‌లు రావేమోనని తప్పుడు అఫిడవిట్లు ఇస్తుంటారు. సాధారణంగా కుటుంబ కలహాలు, ఆస్తుల వివరాలు, ఇతర సివిల్ వివాదాలను పీవీసీలో ఉన్న గేట్ పాస్‌ల విషయంలో పరిగణలోకి తీసుకోలేదు. కేవలం దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, తదితర క్రిమినల్ కేసుల విషయంలో పరిగణలోకి తీసుకుంటారు.

● తప్పుడు అఫిడవిట్లపై సీరియస్..

రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశాలతో తప్పుడు అఫిడవిట్లపై పోలీస్‌శాఖ సీరియస్‌గా స్పందిస్తుంది. సాధారణంగా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లను కీలకమైన ప్రభుత్వశాఖలు, సాయుధ దళాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే సిబ్బందికి తప్పనిసరి. రామగుండంలో కీలకమైన పరిశ్రమలైన ఎన్‌టీపీసీ, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద అమ్మోనియా ప్లాంట్ అయిన ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణికి మందుగుండు సామగ్రి సరఫరా చేసే ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థలు ఉన్నాయి. దీంతో ఇందులో పనిచేసేవారు నేరచరిత్ర లేకుండా ఉండాలనేదే లక్ష్యంగా పెట్టుకున్నారు. అఫిడవిట్లలో పొందుపరిచిన వివరాలను పూర్తిస్థాయిలో జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే 25మందిపై కేసులు నమోదు చేశారు. పలువురిని అరెస్టు చేశారు.

● తప్పుడు అఫిడవిట్లు ఇస్తే జైలుకే..

- సీపీ శ్రీనివాస్

పాస్‌పోర్టులు, ఉద్యోగ నియామకాలు, విదేశాలకు వెళ్లడానికి సంస్థల్లో, కంపెనీల్లో పని చేసేందుకు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారు కేసుల విషయంలో తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాము. నోటరీ చేసే వారు ఒకటికి రెండుసార్లు జాగ్రత్తలు తీసుకోవాలి. గుడ్డిగా నోటరీ చేస్తే వారిపై కూడా చర్యలకు వెనుకాడబోము.

వృద్ధురాలి అదృశ్యం

మల్యాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలకేంద్రానికి చెందిన బైరి గంగమల్లు అనేవృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గంగమల్లు మానసిక స్థితిసరిగాలేక పదిసంవత్సరాలుగా ఇంట్లోనే ఉంటుందని గతనెల 26న భర్త బీరయ్య కూలీకి వెళ్లివచ్చేసరికి భార్య కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికినట్లు తెలిపారు. ఆచూకీ లభించకపోవ డంతో భర్తపోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన నరేశ్ అంత్యక్రియలు

మల్యాల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఆర్‌బీ ఎస్సై శ్వేతతో పాటు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ముత్యంపేటకు చెందిన మల్యాల నరేశ్ కూడా దుర్మరణం చెందగా బుధవారం అంత్యక్రియలు జరిగాయి. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహంను ముత్యంపేటకు తీసుకు రాగా ఆయన సోదరుడు చంద్రశేఖర్ దుబాయి నుంచి వచ్చాక బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు మృతదేహం వద్ద మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు తదితరులు నివాళులు అర్పించారు. వారి వెంట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, దేవరాజం తదితరులు ఉన్నారు.

చొప్పదండి సహకార సంఘాన్ని సందర్శించిన ఒడిశా బృందం

చొప్పదండి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బుధవారం ఒడిశా రాష్ట్ర సహకారశాఖ అధికారుల బృందం సందర్శించింది. సంఘం పనితీరును, రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఒడిశాసహకార శాఖ అడిషనల్ ఆర్‌సీఎస్ సంతోష్‌కుమార్ సాహు, సహకారసంఘం అధ్యక్షుడు వెలమ మల్లారెడ్డి, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, ఇంచార్జి విష్ణు వర్ధన్ రెడ్డి, సీఈవో కల్లెం తిరుపతిరెడ్డి, అభినవ్, డైరెక్టర్లు ఆనంద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



చొప్పదండి సహకార సంఘంలో ఒడిశా బృందం

సోలార్ ప్రాజెక్ట్ కోసం స్థల పరిశీలన



సోలార్ ప్రాజెక్ట్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఫ్రిబవరి, 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే సోలార్ ప్రాజెక్ట్ కోసం అధికారులు స్థల పరిశీలన చేశారు. బుధవారం రెవెన్యూ అధికారులతో జిల్లా అడిషనల్ డీఆర్డీవో చరణ్ దాస్, డీపీఎం మల్లేశం, రెడ్కో సోలార్ ప్రాజెక్ట్ అధికారులు గ్రామ శివారులో పరిశీలించారు. సోలార్ ప్రాజెక్ట్‌తో మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉమేష్, ఏపీఎం విమోచన, సీసీలు వెంకటరమణ, సూరయ్య, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యమని రిటైర్ ఐఏఎస్, శాతవాహన విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి టీ.చిరంజీవులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్)సదరన్ రీజియన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్-2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశం సాధించిన విజయాలను గుర్తించాలని, ఆర్థిక వ్యవస్థ ఎన్నో సమస్యలకు పరిష్కారాలను సూచించిందన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపనున్నట్లు చెప్పారు. వీసీ ఓఎస్‌డీ డాక్టర్ హరికాంత్, సెమినార్ డైరెక్టర్, అర్థశాస్త్ర విభాగపు హెచ్‌ఓడీ డాక్టర్ కోడూరి శ్రీవాణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేపల్లి సుజాత పాల్గొన్నారు.

నేతకానీలకు ఏడు శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గం నగేష్

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నేతకానీ కులస్థులకు ప్రత్యేక గ్రూపు కేటాయించి ఏడు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకుడు మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హాలో నేతకాని టీజీ కామెర ప్రకాష్ అధ్యక్షతన పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో బుధవారం దుర్గం నగేష్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. నేతకానిలు రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల నుంచి 18 లక్షల వరకు ఉన్నారని, ఈ లెక్క తీసుకోకుండా పాతలెక్క ప్రకారం, రిజర్వేషన్ ఎలా అమలు పరుస్తారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ అంశం మీద రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి పేగ శ్రీనివాస్, కామెర పద్మ, కుమ్మరి మల్లేష్, మాదాసు సుధాకర్, కుమ్మరి యువ రాజ్ పాల్గొన్నారు.



ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కళాకారుల ప్రదర్శన



మెట్‌పల్లి డప్పు

ఢిల్లీలో మోగింది

- గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మెట్‌పల్లి కళాకారుల ప్రదర్శన
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు

"గణతంత్ర దినోత్సవం.. ఢిల్లీలోని కర్తవ్యపథ్.. పరేడ్ కన్నుల పండువగా సాగుతోంది.. ఇంతలో 'జయతి.. జయతి..మమ భారతం' అంటూ ఓ గీతం ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐదు వేల కళకారులు తమ ప్రదర్శన ప్రారంభించారు. వారు 54 జానపద కళారీతులను పది నిమిషాలపాటు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఓ రికార్డుగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారు గుర్తించారు. ఈ ప్రదర్శనలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన కళాకారుల పాల్గొన్నారు. గ్రామీణ మహిళలై ఉండి జాతీయ స్థాయి ప్రదర్శనలో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్న ఈ కళాకారులను అందరూ అభినందిస్తున్నారు."



ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న భవానీ బృందం

శంకరపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసలే పల్లెటూరు.. పట్టింపులు ఎక్కువ.. అందులో మహిళల విషయంలో... ఆడపిల్లలు ఇంట్లోనే ఉండాలి.. ఇల్లు దాటి వెళ్లాలంటే కుటుంబ సభ్యులు ఒప్పుకోరు.. అయినా ఆ మహిళలు వాటన్నింటిని అధిగమించారు. సరదాగా నేర్చుకున్న కోలాటంలో పరిణితి చెందారు. డప్పు వాయించడం మీద దృష్టి సారించారు.

క్రమక్రమంగా ఎదిగి పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఇప్పుడు గిన్నిస్ వరల్డ్ రికార్డు బుక్‌లో చోటు సాధించి ప్రశంసలు అందుకుం టున్నారు శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన భవానీ మహిళ గ్రూప్ డప్పు కళాకారులు. ఒకసారి అప్పటి మానకొండూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ కార్యక్రమం మెట్‌పల్లిలో జరిగినప్పుడు భవానీ గ్రూప్ కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఆయన 12 మంది పేర్లు సెలెక్ట్ చేసి హర్యానా రాష్ట్రం సూరజ్ కుండ్‌లో ప్రదర్శనకు మొదటి అవకాశం కల్పించారు. తర్వాత హైద్రాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం పాండిచ్చేరి, బెంగుళూర్, చెన్నైలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● ఢిల్లీలో ప్రదర్శన

భారత ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన పరేడ్‌లో 'జయతి.. జయతి..మమ భారతం' అనే గీతంపై నిర్వహించిన ప్రదర్శనలో వీరు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించారు. దాసారపు భవాని, అంతడుపుల కోమల, మారముల్ల రజిత, దాసారపు స్వప్న, మిడిదొడ్డి రజిత ఈ పరేడ్‌లో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఐదు వేల మంది కళాకారులు ఒకేచోట ప్రదర్శన ఇవ్వడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు.

డప్పు ప్రదర్శనలు మా జీవితాన్ని మార్చాయి.. దాసారపు భవాని, కళాకారిణి

తీరిక సమయాల్లో కోలాటం నేర్చుకుని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు, ఇతర కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చాం. హర్యానా సూరజ్ కుండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నాం. ఆ తర్వాత చిన్న చిన్న కార్యక్రమాలకు వెళ్లేవాళ్లం. మా కోలాట ప్రదర్శన చూసి డప్పు కళాకారులకు శిక్షణ ఇచ్చే అందాని నారాయణ మాతో మాట్లాడారు. డప్పు వాయిద్యంలో శిక్షణ తీసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కుటుంబ సభ్యులు డప్పు వాయిద్యం నేర్చుకుంటామంటే ఒప్పుకోలేదు. మహిళలు డప్పు వాయించడం ఏంటని అడ్డు చెప్పారు. అందాని నారాయణ వచ్చి మా కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఒప్పించారు. అనంతరం ఆయన మాకు శిక్షణ ఇచ్చారు. డప్పు ప్రదర్శనతో దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. మాకు ఉపాధి లభించింది. చాలా గ్రామాల్లో మమ్మల్ని చూసి మహిళలు డప్పు వాయిద్యం నేర్చుకోవడం మాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మా ప్రతిభను గుర్తించి సన్మానించి, మాకు షూస్ అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్‌లో పాల్గొని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించడం గర్వంగా ఉంది. ఏ పనినైనా మనసుపెట్టి ఇష్టంతో చేస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చు.

కుటుంబ సభ్యుల సహకారంతో.. రజిత, కళాకారిణి, మెట్‌పల్లి



కోలాటంతో గ్రామాల్లో చిన్న చిన్న కార్యక్రమాలు చేశాం. కుటుంబ సభ్యుల సహకారంతో ముందుకు సాగాం. కళా రంగంలో నైపుణ్యానికి ఆత్మస్థయిర్యం పట్టుదల తోడైతే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు.





శ్రీదేవి డ్రామా కంపెనీ కార్యక్రమంలో పాల్గొన్న భవానీ మహిళా డప్పు కళాకారుల బృందం, రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఫిలిప్పీన్స్ యువరాణికి స్వాగతం పలుకుతున్న కళాకారులు (ఫైల్)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామి నేషన్ అందజేశారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేశారు.

కొడుకులు పోషణ బాధ్యతలు తీసుకునేలా చూడండి

ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధురాలు



ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న నర్సవ్వ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన రెండో కొడుకు ఇంటి నుంచి బయటికి పంపించాడని, నా ఇంటిని నాకు అప్పగించి కొడుకులు పోషణ బాధ్యత తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన గుగ్గిల్ల నర్సవ్వ అనే 80 సంవత్సరాల వృద్ధురాలు బుధవారం జగిత్యాల ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. తనకు ముగ్గురు కుమారులు ఉండగా, ముగ్గురికి తలా మూడున్నర ఎకరాల వ్యవసాయ భూమి పంచి ఇచ్చానని, 9 సంవత్సరాల క్రితం చిన్న కొడుకు మరణించాడని, నా పెద్ద కొడుకు శంకర్, మరో కొడుకు మల్లయ్యలు తనను పోషించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన నడిపి కొడుకు మల్లయ్య కొట్టి బలవంతంగా ఇంటి నుంచి వెళ్లగొట్టాడని కన్నీటి పర్యంతమైంది.

సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ వెంట వృద్ధురాలు ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి తఫాజుల్ హుస్సేన్‌కు తన ఫిర్యా దు అందజేసింది. ఈ విషయమై వృద్ధురాలి కొడుకులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న శనిగరపు రజినీకాంత్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, సమరశీల పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని అంకారపు నరసయ్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి మహాసభలు జరిగాయి. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయడం లేదని, మెనూ అమలు చేయడం లేదని అన్నారు. గురుకులాలు సమస్యలను పరిష్కరించడం లేదని, యూనివర్సిటీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం లేదని, యూనివర్సిటీలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయకుండా విద్యార్థులపై అదనపు భారం మోపుతోందని, ఇటు కార్పొరేట్ కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టడం లేదని ధ్వజమెత్తారు. గురుకులాలులో ఫుడ్ పాయిజన్ అవుతున్నా వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని. యూనివర్సిటీలకు ప్రత్యేక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి అభివృద్ధి కోసం పాటుపడాల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శులు మల్లారపు అరుణ్ కుమార్, ఎర్రవెల్లి నాగరాజు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ ఉపాధ్యక్షుడు మనోజ్, రాకేష్ సహాయ కార్యదర్శి కళ్యాణ్ ఆదిత్య, సాయి భరత్, శివ అశ్విని, సంజన పాల్గొన్నారు.

ఉపాధి కల్పించకనే నేతన్నల ఆత్మహత్యలు

సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం సరైన ఉపాధిని కల్పించకపోవడంతోనే ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ ఆరోపించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నేతన్నలకు సరైన ఉపాధిని కల్పించి వర్కర్ టూఓనర్ పథకాన్ని ప్రారంభించాలని, లేకుంటే ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు.

సిరిసిల్ల పట్టణం గణేష్‌నగర్‌లోని పార్క్‌లో బుధవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కోడం రమణ అధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2023 సంవత్సరంలో మరమగ్గాల కార్మికులు తయారు చేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన యారన్ సబ్సిడీతో పాటు కూలీపెంపు, వర్కర్ టూ ఓనర్ పథకాలు, కార్మికుల సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో గత సంవత్సరం కాలంగా సరైన ఉపాధి లేకపోవడంతో మరమగ్గాల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సంవత్సర కాలంలో దాదాపు 15 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఉపాధి కల్పించి మెరుగైన వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పెద్దఎత్తున పోరాటం చేసిన ఫలితంగా ప్రభుత్వం స్పందించి బతుకమ్మ చీరల స్థానంలో మహిళ పొదుపు సంఘాల మహిళలకు చీరలను అందించేందుకు చీరల తయారీ అర్డర్‌లను ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ చీరలకు సంబంధించి మరమగ్గాల కార్మికులకు రోజుకు కనీసం రూ. 100 కూలీ వచ్చేవిధంగా పాలిస్టర్ వస్త్రానికి కూలీ ఒప్పంద గడువు ముగిసిన యాజమానులు కూలీ పెంచడం లేదని, 2023లో కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీతో పాటు వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయడంలో అధికారులు తీవ్రంగా కాలయాపన చేస్తున్నారని అన్నారు. మరమగ్గాల కార్మికుల డిమాండ్‌లను పరిష్కారించకుంటే ఈ నెల 17వ తేదీ తర్వాత ఏ రోజు నుంచైనా నిరమధిక సమ్మెను వెళ్తతామని ప్రకటించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూం వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఎన్నిక

సిరిసిల్ల పట్టణ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాస శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా అల్లె లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా బూర తిరుపతి, ఉపాధ్యక్షులుగా కొండ దేవేందర్, మిట్టపల్లి అశోక్, బొల్లి మోహన్, సహాయ కార్యదర్శులుగా బండి రాజశేఖర్, ఒడ్నాల రాములు, మంత సంగమేష్, సభ్యులుగా అమంచ శ్రీనివాస్, భైరి రాజు, బింగి అనందం, వెంగళ లింగయ్య, కనుకుంట్ల మురళి, వడ్డెపల్లి చంద్రయ్య, సబ్బని శ్రీనివాస్, వెంకటేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ ప్రకటించారు.

రాజన్న ఖజానాకు రూ. 1.87 కోట్ల ఆదాయం



వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి హుండీలను బుధవారం లెక్కించారు. గత 28 రోజుల హుండీలను ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో లెక్కించగా రాజన్న ఖజానాకు రూ. కోటి 87 లక్షల 20 వేల 966 నగదు సమకూరగా, 115.9 మిల్లీ గ్రాముల బంగారం, 9 కిలోల 500 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఎస్పీఎఫ్ అధికారి కరణ్‌సింగ్, ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, సిబ్బంది రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భరణి నక్షత్రం పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న కళాకారులు

వేములవాడలో ఘనంగా

గూగులమ్మ బోనాలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి యూట్యూబ్ తల్లి, గూగులమ్మ బోనాలను కళాకారులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఎఫ్ కళాకారులు వేములవాడకు చేరుకుని మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా

ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

ఆలయానికి చేరుకున్నారు. పట్టణ పురవీధుల్లో పలువురు యూట్యూబ్ కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. తమ ఇష్టమైన యూట్యూబ్ స్టార్‌లను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మారం ప్రవీణ్‌కుమార్ (పప్పి) తదితరులు ఉన్నారు.



బద్దిపోచమ్మ ఆలయానికి బోనాలతో వెళుతున్న కళాకారులు

వేయి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన వాయిదా

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న తలపెట్టిన వేల గొంతులు లక్షల డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్ మాదిగ తెలిపారు. స్థానిక ఐబీలో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని వాయిదా వేశామని తిరిగి త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్, ఎంఎస్పీ అధ్యక్షుడు కనకం శంకర్, క్యాదాసి చంద్రమౌళి, లక్ష్మణ్, రాజేశం, నాంపల్లి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జూలపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో భారతీయ జనతాపార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటుగా రూ.5300కోట్ల నిధులను కేటాయించిందన్నారు. రూ.12 లక్షలలోపు ఆదాయానికి పన్ను మినహాయింపు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడిపాటి సంతోష్ రెడ్డి, దాడి రవీందర్, బొజ్జ సంపత్, బూసారపు రవీందర్, మల్లెత్తుల నర్సయ్య, దాడి లక్ష్మణ్, పెద్దోళ్ల ఐలయ్య, కోడూరి రాజేశ్వర్, మోహన్‌రెడ్డి, మెండ శ్రీకాంత్, అమరగాని సాయి, వడ్లకొండ శ్రావణ్ పాల్గొన్నారు.

ఈ దారిలో వెళ్లేదెలా?

- సుల్తానాబాద్‌లో ప్రధాన రహదారిపై దుమ్ము - నరకయాతన పడుతున్న ప్రజలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి గట్టేపల్లి వరకు ఉన్న రోడ్డు, దాని ద్వారా వచ్చే దుమ్ము మూలంగా పట్టణ ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు సైతం నడుపుకోలేని పరిస్థితి నెలకొంది. మరికొందరు తప్పని పరిస్థితిలో షాపులకు దుమ్ము రాకుండా కవర్లను అడ్డుపెట్టుకుంటున్నారు. దాంతో దుకాణాలు కనబడక, దుమ్ము మూలంగా వస్తువులన్నీ పాతగా కనబడడంతో వాటిని ఎవరూ కొనక దుకాణాలు నడవడం లేదని దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వెంట నడిచి కానీ ద్విచక్ర వాహనాల ద్వారా కానీ వెళ్లలేని దుస్థితి నెలకొంది. అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోర్టు, ప్రభుత్వ అసుపత్రి, తహసీల్దార్, ఎస్‌టిటీ, సబ్‌రిజిస్ట్రార్, ఎక్సైజ్, వ్యవసాయశాఖ, మండల పరిషత్, ఐకేపీ, ఈజీఎస్, ఎంఈవో తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకుఇదే ప్రధాన రోడ్డుగా ఉంది. ఇంతటి ప్రాధాన్యం కల రోడ్డుపై దుమ్ము విపరీతంగా పేరుకుపోయింది. ఏదైన వాహనం వస్తే చాలు రోడ్డు పక్కన నడుస్తున్న వారు కానీ ఆ వాహనం వెనుక ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్, పలు గోదాములు, ఇసుక క్వారీలు, బండ రాళ్ల క్వారీలు ఈ మార్గంలోనే ఉన్నాయి. ఇసుక రవాణా చేసే వాహనాలు, క్వారీల నుంచి పెద్దపెద్ద బండలు తరలించే లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాల వలన వచ్చే దుమ్ము మూలంగా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. దుమ్ము రాకుండా కనీసం నివారణ చర్యలు కూడా తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయలు మంజూరుకాగా శంకుస్థాపన కూడా చేశారు. ఏడాది దాటినా పనులు జరగడం లేదు. దీంతో దుమ్ము సమస్య ఇంకా ఎన్నాళ్ల భరించాలని ప్రజలు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.



దుమ్ములోనికి వెళ్లకుండా కవర్ ఏర్పాటు చేసుకున్న షాప్ నిర్వాహకుడు, రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

● ఏడాది క్రితం శంకుస్థాపన

ఐబీ చౌరస్తా నుంచి గట్టేపల్లి రోడ్డు వరకు నూతన రోడ్డు నిర్మాణం కోసం 14 మార్చి 2024న శంకుస్థాపన చేశారు. నాలుగు వరసల రోడ్డు కోసం డీఎంఎఫ్‌టీ గ్రాంటు ద్వారా రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఏడాది అవుతున్నా ఆ రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టలేదు. కొంతకాలం రోడ్డు వెడల్పు కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుకు ఇరుపక్కల ఆక్రమణలు సైతం తొలగించారు. ఇక రోడ్డు పనులు ప్రారంభం అవుతాయని అందరూ ఎదురుచూశారు కానీ వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు.

● దుకాణాలు నడవడం లేదు

- లక్ష్మీనారాయణ, షాప్ నిర్వాహకుడు



రెండు మూడేళ్ల నుంచి దుమ్ముతో అవస్థ పడుతున్నాము. ఇసుక క్వారీల నుంచి లారీలు నడిచినప్ప టి నుంచి మొదలైన సమస్య ఇప్పటికీ తమను వీడలేదు. వాహనాల రాకపోకల మూలంగా పెద్దఎత్తున దుమ్ము షాపుల్లోకి వస్తుంది. వస్తువులన్నీ దుమ్ముతో నిండుకుని ఎవరూ కొనడం లేదు. దుమ్ము నివారణకు కవర్లను ఏర్పాటు చేసుకుంటే దుకాణాలు కనబడడం లేదు. అనేక సార్లు కమిషనర్‌ను కలిసి సమస్య విన్నవించాము.

● అద్దె చెల్లించలేకపోతున్నాం

- ఒజ్జ సతీష్‌యాదవ్, టీ స్టాల్ నిర్వాహకుడు



రోడ్డు నుంచి వస్తున్న దుమ్ము కారణంగా చాయ్ తాగడానికి ఎవరూ రావడం లేదు. రోజుకు ఐదారు వేల రూపాయల గిరాకీ అయ్యేది. ఇప్పుడు దుమ్ముతో ఎవరూరాక కనీసం రెండు వేలు కూడా కావడం లేదు. అద్దె చెల్లించలేక అప్పుల పాలవుతున్నాము.

'స్థానిక' ఎన్నికల్లో కమలం జెండా ఎగురవేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం జెండా ఎగర వేయడానికి ప్రణాళికలు రూపొందిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఆయనను పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష పదవి అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటానని, జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం జెండా ఎగరవేస్తామన్నారు. జిల్లాలో వర్గపోరును ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పార్టీలోని ప్రతీఒక్కరినీ కలుపుకొని కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ ఆదేశాలు నాయకులు, కార్యకర్తలకు శిరోధార్యమని అన్నారు. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా నాయకులు, కార్యకర్తలు ఎవరు వ్యవహరించినా సహించేది లేదని హెచ్చరించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సిద్ధాంత బలంతో పనిచేసిన కార్యకర్తల త్యాగఫలితంగా ఈనాడు దేశంలో, ప్రపంచంలో బీజేపీకి ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నిబద్ధతతో పనిచేసి జిల్లా అధ్యక్షుడిగా సంజీవ రెడ్డి బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, రామగుండం నియోజవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, సీనియర్ నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాసరావు, కోమల్ల వాసు, కంకణాల జ్యోతిబసు, అక్కెపల్లి క్రాంతి, బెజ్జంకి దిలీప్‌కుమార్, జంగ చక్రధర రెడ్డి, అడిచెర్ల స్వతంత్రకుమార్, మంథని కృష్ణ, మౌటం నర్సింగం, శాతరాజు నరేష్, ఎండీ ఫహీం, మొలుగూరి రాజవీరు, గాండ్ల రవి, ముస్త్యాల సంతోష్, రెడపాక క్రిష్ణ, అమరగాని ప్రదీప్‌కుమార్, పాల్గొన్నారు.


సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జులను సన్మానిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ అందజేత

కమాన్‌పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండారం గ్రామపంచాయతీ రాజాపూర్ గ్రామంలో గల ఎంపీపీఎస్ రాజాపూర్ పాఠశాల విద్యార్థుల కోసం స్థానిక రాజాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఈ ముకుంద రాజన్న 15వేల రూపాయల విలువగల ఎల్‌ఈడీ టీవీని బుధవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు కూడా ప్రైవేటు వారితో పోటీ పడాలని, వారికి ఎందులోనూ తక్కువగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ విజయ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆవునూరి లలిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రాజమౌళి, సహోపాధ్యాయులు బి మమత, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముకుంద రాజన్నను పలువురు అభినందించి సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

ముత్తారం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో సురేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికమైన ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. పరిశుభ్రమైన తాగునీరు అందిచాలని ఆదేశించారు. పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలదే పైచేయి

(5వ పేజీ తరువాయి)

చేపట్టిన కులగణన సర్వే ద్వారా రాష్ట్రంలో బీసీలు ముస్లింలో ఉన్న బీసీలను కలుపుకుని 56.33 శాతం, ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం, ముస్లింలతో కలిపి ఓసీలు 15.79 శాతం మంది ఉన్నారని తేల్చారు. సర్వే జరిగిన తీరుపై అటు.. ప్రతిపక్ష పార్టీలు, ఇటు.. బీసీ సంఘాలు సర్వే అంతా తప్పుల తడక అని, బీసీల సంఖ్యను తగ్గించి, ఓసీల సంఖ్యను ఎక్కువగా చూపెట్టి, బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ సర్వే ఎలా ఉన్నా రాష్ట్రంలో ఉన్న జనాభాలో అత్యధిక మంది బీసీలే ఉన్నారని సర్వే ద్వారా వెల్లడయ్యింది. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో కులగణన సర్వేకు ఏకగ్రీవంగా సభ ఆమోదం తెలిపింది. దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. సుప్రీంకోర్టు ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని చెబుతున్నారు. ఆ ప్రకారమే రిజర్వేషన్లు కేటాయిస్తూ వస్తున్నారు. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలతో పాటు, బీసీలు, మైనార్టీలు, ఓసీలను లెక్కించాలని ఎన్నాళ్ల నుంచో ఉన్న డిమాండ్ నేరవేరడం లేదు. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా లెక్కలను అనుసరించే రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. వారి రిజర్వేషన్లు పోనూ మిగతా బీసీలకు కేటాయిస్తున్నారు. బీసీలకు 24 శాతానికి మించి స్థానాలకు కేటాయించడం లేదు. అన్ రిజర్వుడ్ స్థానాల్లోనే ఎక్కువగా పోరాటం చేయాల్సి వస్తున్నది. రాజ్యాంగబద్ధంగా బీసీల జనాభాను అనుసరించి రిజర్వేషన్లను పెంచక పోయినా, కాంగ్రెస్‌పార్టీ పరంగా తాము వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు టికెట్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ పరంగా సీట్లు ఇవ్వనప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము సత్తా చాటామని, పార్టీలు టికెట్లు ఇచ్చినా, ఇవ్వకపోయినా స్వతంత్రంగానైనా పోటీ చేస్తామని వివిధ పార్టీల బీసీ నాయకులు అంటున్నారు. రాజ్యాంగబద్ధంగా బీసీల సంఖ్య ఆధారంగానే రిజర్వేషన్లను పెంచాలని, అంతేగాకుండా సంక్షేమ ఫలాలు ఎక్కువగా అందించేందుకు బీసీ సబ్ ప్లాన్ తీసుకురావాలని బీసీలు డిమాండ్ చేస్తున్నారు.

● కులగణనతో బీసీల్లో ఐక్యత పెరిగేనా?

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో బీసీల్లో మరింత ఐక్యత పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ద్వారా బీసీల జనాభా లెక్కలు తేలినప్పటికీ, దానికి చట్టబద్ధత లేక పోవడంతో బీసీల్లో పెద్దగా ఐక్యతా రాగం వినిపించ లేదనే అభిప్రాయం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగుణన సర్వే అధికారికం కావడంతో జనాభా ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ల కోసం ప్రభుత్వాలతో కొట్లాడేందుకు మరింత ఊతం ఇవ్వనున్నదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీయే కాకుండా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఇతరపార్టీలు జనరల్ స్థానాల్లోనూ అత్యధికంగా బీసీలకు టికెట్లు ఇచ్చేందుకు పోటీ పడే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు ఘనస్వాగతం


క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మధురైలో 24వ జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించి మొదటిసారి గోదావరిఖనికి విచ్చేసిన క్రీడాకారులకు బుధ వారం గోదావరిఖనిలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఘనస్వాగతం పలికారు. క్రీడాకారులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం జట్టు 4వ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 38 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో గోదావరిఖని ప్రాంతం నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేరుగు హన్మంత్‌గౌడ్, కోమళ్ళ మహేష్, కుర్ర రాజేందర్, రాకేష్, ప్రవీణ్, అపర్ణ, పద్మ, విశ్వాస్, క్రీడాకారులు శ్రీనిధి, గీతిక్, సాయి రశిత, సహస్ర, అక్షయసాయి, హ్యాన్సా, అకీరానందన్, సాయిరశిత పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

ధర్మారం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) మనోధైర్యంతో క్యాన్సర్ వ్యాధిని జయించవచ్చని ఎంపీడీవో ఐనవోలు ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఎస్‌ఐ శీలం లక్ష్మణ్, ఎంఈవో పోతు ప్రభాకర్ మేడారం పీహెచ్‌సీ డాక్టర్ అనుదీప్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్మన్ డాక్టర్ కామని శ్రీనివాస్, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

ఎలిగేడు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌లో ప్రజలకు తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని మండల పంచాయతీ అధికారి ఎండీ ఆరీఫ్ సూచించారు. బుధవారం మండలంలోని ముప్పిరితోటలో ఆయన తాగునీటి సరఫరాపై ఏర్పాటుచేసిన స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం సందర్భంగా ఆయన గ్రామాన్ని సందర్శించారు. వేసవి సీజన్‌లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి విషయంలో పంచాయతీ క్యాదర్శులు, మిషన్‌భగీరథ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రిడ్ అధికారి సూర్యతేజ, పంచాయతీకార్యదర్శి శిరీష, కారోబార్ రమేష్ పాల్గొన్నారు.

'కాటమయ్య'తో గీత కార్మికులకు రక్షణ

ధర్మారం పిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాటమయ్య రక్షణ కవచం గీతా కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షిస్తుందని పెద్దపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మేడారంలో గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం ఎలా వాడాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైనర్ మూల మల్లేశం, ఇల్లందుల అంజిబాబు, బత్తిని శ్రీనివాసు లు, సర్వాయిపాపన్న మోకు దెబ్బ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య పాల్గొన్నారు.

ఏసీపీ కృష్ణకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామస్థులు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మండలంలో ఎస్సైగా పనిచేసేటప్పుడు సలహాలు సూచనలు ఇచ్చారని గుర్తుచేసుకున్నారు.

చెక్‌డ్యాం నిర్మాణాలకు ఇరిగేషన్ అధికారుల సర్వే

కమాన్‌పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామంలో గల రెండువాగులపై ఇరిగేషన్ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన పెంచికల్‌పేట్ వాగులపై చెక్‌డ్యాంల నిర్మించి రైతులకు సాగునీటి ఇక్కట్లు దూరం చేయాలని పల్లె నారాయణ అనే రైతు సింగరేణి ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్యకు ఇటీవల వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో సానుకూలంగా స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణాలపై సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఇరిగేషన్ అధికారులకు జీఎం సూచించారు. ఇరిగేషన్ అధికారులు పెంచికల్‌పేట్‌లో గల యాపలవాగుపై రెండు చోట్ల, మద్దులవాగుపై మరో రెండుచోట్ల చెక్‌డ్యాంల నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదిత స్థలాలను గుర్తించారు.

అలాగే వీటి నిర్మాణాలకు సంబంధించిన అంచనా వ్యయాలను రూపొందించేందుకు సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు నివేదికను సింగరేణి అధికారులకు సమర్పించనున్నారు. అనంతరం నిధులు మంజూరుకోసం సింగరేణి ఆర్జీ-2 అధికారులు సింగరేణి సంస్థ యాజమాన్యానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది. సర్వే కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జక్కా ప్రవీణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిప్ప సదానందం, లస్కర్లు నారాయణ, రాజేందర్, రైతులు పల్లె నారాయణ, సిరివేన రాజు, డబ్బేట లింగయ్య, కొలిపాక పోచాలు, నూనే నర్సింగం తదితరులు పాల్గొన్నారు.


చెక్‌డ్యాం నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్న అధికారులు



ఫాగింగ్ చేపట్టాలని జీఎంకు వినతి

రామగిరి, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ, పన్నూరు గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించాలని పన్నూరు మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలోని జోన్1, 2, శ్రీలంక క్వార్టర్స్‌లో విపరీతంగా దోమల వ్యాప్తి పెరిగిందని వినతిలో పేర్కొన్నారు. డ్రైనేజీలో మురుగునీరు పెరిగిపోవడంతో దోమల వ్యాప్తి తీవ్రంగా ఉందని తక్షణమే ఫాగింగ్ చేపట్టాలని వినతిలో కోరారు.

కార్మికుల పిల్లల పోరాటానికి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల పిల్లలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, ఓట్లు వేసి గెలిపించినవారి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క క్షణం ఆలోచించకుండా మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మారుపేర్లు ఉన్న సింగరేణి కార్మికుల పిల్లలు గోలేటి నుంచి కొత్తగూడెం వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం మంథనికి చేరుకోగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో వారికి స్వాగతం పలికిన పుట్ట మధు తన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయన్నారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను మోసం చేసి దగా చేశాయన్నారు. సంస్థలో ఉద్యోగులు చేసిన తప్పులకు సింగరేణి కార్మికుల పిల్లలు బాధలు భరించడం అన్యాయమన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి వీరి సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. కేవలం విజలెన్స్ డిపార్టుమెంట్‌లో చిన్న సవరణలు చేసే వారి సమస్య పరిష్కారం అవుతుందని, ఈదిశగా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి సింగరేణి కార్మికుల పిల్లలు చేస్తున్న పోరాటానికి తాను అండగా ఉంటానని హామీఇ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

సాహిత్య పాఠశాల సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అమర వీరుల స్తూపం వద్ద 24వ సాహిత్య పాఠశాల సదస్సు కరపత్రంను బుధవారం ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8,9 తేదీల్లో కర్నూల్‌లో 24వ సాహిత్య పాఠశాల సదస్సు జరుగుతుందన్నారు. రచయితలు, కళాకారులు, బుద్ధి జీవులు తమ సామాజిక రాజకీయ ఆచరణ తాజాగా పునర్విచించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, ఉపాధ్యక్షుడు నారా వినోద్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న, టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమరయ్య పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో జేపీసీ ఆధ్వర్యంలో నిరసన

జ్యోతినగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల కూటమి (జేఏసీ) నిరసన తెలిపింది. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్లాంటు లేబర్ గేటు వద్ద జాతీయ కార్మిక సంఘాల ఫ్రంట్ పిలుపులో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. విధులకు వెళ్తున్న కార్మికులకు నల్లబ్యాడ్జీలను పెట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా విధానాలను అమలు చేస్తోందని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఎన్టీపీసీ యాజమాన్యంతో 2018, 2022లో కుదుర్చుకున్న ఒప్పందాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, రాఘవరెడ్డి (సీఐటీయూ), భూమల్ల చందర్(ఐఎన్‌టీయూసీ), నాగభూషణం(ఐఎఫ్‌టీయూ), ఇజ్జగిరి భూమయ్య(బీఆర్ఎస్), రాజమల్లయ్య (గోదావరి ఏరియా), శ్రీనివాస్(టీఎన్‌టీయూసీ) పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం జరిగిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మేరుగు చంద్రయ్య ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు, కార్మికులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని పైలాన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే వెనకకు తీసుకోవాలని, కార్మిక, వ్యవసాయ రంగానికి నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామి పథకాన్ని 200రోజులకు పెంచాలని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ స్వదేశీ, విదేశీ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని, దీనిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, నరేష్, రాజేశం, అశోక్, మల్లేష్, రాజేందర్, కొమురయ్య, రవి కుమార్, రమేష్, అన్వేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

'జీవిత చిత్రీకరణే అసలైన సాహిత్యం'


అస్పృశ్యయోధుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జీవిత చిత్రీకరణ అసలైన సాహిత్యమని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో అరసం ఆధ్వర్యంలో జరిగిన బుద్ధుడి నుంచి గద్దర్ వరకు అస్పృశ్యయోధుడు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనుషుల మధ్య నేటికీ కొనసాగుతున్న వివక్షత, అసమానతలను రూపుమాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బిక్షమయ్య లాల్ నీల్ ఐక్యతను కోరుతూ తన ఇంటర్వ్యూల ద్వారా పలువురితో పంచుకున్న అంశాలను ప్రచురించి బుద్ధుడి నుంచి గద్దర్ వరకు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారన్నారు. దళితుల జీవితాలు, పోరాటం, ప్రశ్నించడం ద్వారానే మారుతాయని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు మాదాసు రామమూర్తి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బొజ్జ బిక్షమయ్య, పల్లెర్ల వీరస్వామి, కృష్ణ, జగదీష్, కే స్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.